

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి అర్హులైన, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా కన్వీనర్ హేమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన అభ్యర్థులు https://mipapbcwreis.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుందని తెలిపారు. ఐదో తరగతి ప్రవేశానికి రూ.100, ఇంటర్ ప్రవేశానికి రూ.250 రుసుం చెల్లించాలని అన్నారు. వచ్చే నెల 13న పది, 27న ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. ఆన్‌లైన్ సమయంలో అనుమానాలు ఉంటే ప్రిన్సిపాల్ ఫోన్ నంబరును 9618880991ను సంప్రదించాలని సూచించారు.

ఆమదాలవలస మండలం కలివరంలో నాగావళి ఉధృతికి కోతకు గురైన గట్టు (ఫైల్)



కరకట్టల నిర్మాణాల విషయంలో ప్రభుత్వం ఉదాసీనం నదీతీర గ్రామాల ప్రజలను కష్టాలు పాల్జేస్తోంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో కరకట్టల పనులను రద్దు చేసింది. వాటి స్థానంలో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల్లో వరద గట్లు నిర్మించాలని నిర్ణయించింది. ప్రభుత్వ సూచనలతో వంశధార, నాగావళి నదీ తీర ప్రాంతాల్లో తీవ్ర కోతకు గురైన ప్రాంతాలను గుర్తించారు. రక్షణ గోడల నిర్మాణానికి అవసరమైన అంచనా వ్యయంతో ప్రభుత్వానికి 2020లోనే ప్రతిపాదనలు పంపారు. నాలుగేళ్లు అవుతున్నా నేటికీ ఆమోదం తెలపలేదు. పనులకు సంబంధించిన ఫైల్‌కు ఏదో ఒక కొర్రీ వేసి వెనక్కి పంపుతోంది. దీంతో వంశధార, నాగావళి కరకట్టల కొత్త పనులకు ఒక్క అడుగూ పడటం లేదు.

కరకట్టు కథలేనా?

- **2019లో ఉన్నపళంగా పనులను రద్దు చేసిన ప్రభుత్వం**
- **ప్రమాదకర ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణానికి నిర్ణయం**
- **నాలుగేళ్లుగా ప్రతిపాదనలు పంపుతున్న అధికారులు**
- **కొర్రీలతో వెనక్కి పంపుతున్న వైనం**

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార, నాగావళి నదుల వరదల నుంచి నదీ తీర గ్రామాల రక్షణకు గతంలో కరకట్టల పనులను ప్రారంభించినా ఫలితం లేకపోయింది. 2009-10 మధ్య కాలం వరకు కాస్తాకూస్తో పనులు జరిగినా ఆ తర్వాత నుంచి ఒక్క అడుగు ముందుకు పడటం లేదు. కరకట్టల నిర్మాణానికి పెద్ద ఎత్తున భూమిని సేకరించాల్సి ఉండటం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో ప్రభుత్వం 2019లో ఉన్నపళంగా కరకట్టలను రద్దు చేసింది. వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలంటూ అధికారులను ఆదేశించింది. జిల్లాలో ఆ విధంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అధికారులు 2020 ఫిబ్రవరిలోనే ప్రతిపాదనలు పంపారు. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. నాగావళి నది పరివాహక ప్రాంతమైన ఆమదాలవలస మండలం తొగరం వద్ద రూ.13.14 కోట్లతో, పొందూరు గండ్రేడు వద్ద రూ.8.82 కోట్లతో, ఆమదాలవలస బెలమాం వద్ద రూ.1.83 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. బూర్జ మండలం అల్లెన నుంచి బూర్జ పాత కరకట్ట వరకు వరద గట్టు కోసం రూ.13.86 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మొత్తం రూ.37.65 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అదేవిధంగా వంశధార నదీ పరివాహక ప్రాంతంలో 22.77 కి.మీ మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.77.60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పంపి మూడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నేటికీ ఆమోదం తెలపలేదు.

కరకట్టల పనుల పరిస్థితి ఇలా

వంశధార నదిపై నిర్మించాల్సిన కరకట్టలను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ పనులు 2007లో ప్రారంభించారు. ఇప్పటివరకు 7.55 శాతం పనులే పూర్తయ్యాయి. 2007లోనే మొదలైన ప్యాకేజీ-2 పనులు 5.66 శాతం మాత్రమే జరిగాయి. ప్యాకేజీ-3 పనులను కూడా 2007లో ప్రారంభించారు. 2.45 శాతం పనులు పూర్తి చేశారు. 2009లో ప్రారంభమైన ప్యాకేజీ-4 పనులు 21.32 శాతం మాత్రమే జరిగాయి. నాగావళి నదిపై నిర్మిస్తున్న కరకట్టల పరిస్థితి కూడా అలానే ఉంది. శ్రీకాకుళం జిల్లాలో నిర్మిస్తున్న కరకట్టలను నాగావళి-2 ప్యాకేజీ పనులుగా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్సు సంస్థకు రూ.61.45 కోట్లకు పనులను అప్పగించారు. 2008లోనే పనులను ప్రారంభించింది. ఇప్పటికి కూడా పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. జిల్లా పరిధిలో 51.88 కి.మీ మేర వరద కట్ట నిర్మించాల్సి ఉండగా ఇప్పటివరకు 17.29 కి.మీ పొడవు మేర మాత్రమే పని పూర్తయింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసిన పనులను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ వాటిని మే 29, 2019న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు ఎక్కడి పనులను అక్కడే నిలిపేశారు

ఎన్నాళ్లీ ముంపు బాధలు ?

వర్షాకాలం వస్తే చాలు నదీ తీర గ్రామాలకు ముంపు బాధలు తప్పడం లేదు. ఏటా ఇదే సమస్య పునరావృతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో గతేడాది ఆగస్టులో ఒడిశాలో కురిసిన వర్షాలకు వంశధారకు ఆకస్మిక వరద వచ్చింది. హిరమండలం మండలం గొట్టాబ్యారేజి వద్ద గరిష్టంగా 77 వేల క్యూసెక్కులు నమోదైంది. వరద ఉధృతితో కొత్తూరు మండలంలోని పెనుగోటివాడ, మాతల, నివగాం, సోమరాజపురం, ఆకులతంపరలో పొలాలు ముంపునకు గురయ్యాయి. సుమారు 500 ఎకరాల్లో వరి, అరటి, చెరుకు పంటలు దెబ్బతిన్నాయి. తుపాన్లు, వర్షాల సమయంలో వరద హెచ్చరికలు జారీ చేసి హడావుడి చేస్తున్న ప్రభుత్వం... ఆ తర్వాత రక్షణ చర్యలను విస్మరిస్తోంది. దీంతో వర్షాకాలంలో నదీ తీర గ్రామాల ప్రజలు ముంపు బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నదీ తీర గ్రామాల వెంబడి కరకట్టలను నిర్మించాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

ఎన్నికల ప్రక్రియలో సంస్కరణలు అత్యవసరం

అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి రాజేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల ప్రక్రియలో సంస్కరణలు అత్యవసరమని, వాటిని అమలు చేయడంలో ఎలక్షన్ కమిషన్‌కు స్వయం ప్రతిపత్తి ఉండాలని విశాఖ నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జి.వి.రాజేశ్వరరావు అన్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె. మూర్తి అధ్యక్షతన 'ఎన్నికల సంస్కరణలు - ఆవశ్యకత' అన్న అంశంపై గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నగరంలోని యుటిఎఫ్ భవన్ మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు పాత్ర తీవ్రంగా పెరిగిందని అన్నారు. సామాన్యుడు పాల్గొనే పరిస్థితి లేదని పేర్కొన్నారు. నిజమైన ప్రజా సమస్యలు చర్చకు రాకుండా సున్నితమైన కుల, మత సమస్యలపై దృష్టి మళ్ళిస్తున్నారని అన్నారు. చట్టసభల్లో ప్రజలందరి అభిప్రాయాలకు ప్రాతినిధ్యం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రుగ్మతలకు దామాషా ఎన్నికల పద్ధతి పరిష్కారమని అభిప్రాయం వ్యక్తం చేశారు. తాజాగా సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్లను రద్దు చేస్తూ తీర్పు చెప్పడం మంచి పరిణామమని అన్నారు. ప్రజాస్వామ్య ప్రియులందరూ ఈ తీర్పును స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాసామ్య దేశమైన భారత దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ లక్ష్యాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓట్లు, సీట్లకు పొంతన ఉండడం లేదన్నారు. అంబేద్కర్ యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధ్యాపకులు డాకర్ జిలీలావరప్రసాదరావు మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు అపహాస్యం పాలవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కెనడా, బెల్జియం, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో 95 శాతం పోలింగ్ అవుతోందని ఉద్ఘాటించారు. ఎన్నికల్లో అవినీతిని అరికట్టేందుకు దినేష్ గోస్వామి, తదితర కమిషన్ సిఫార్సులను పకడ్బందీగా అమలు చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ధన బలం, కండ బలం ఉన్నవారే రాజకీయాలను శాసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సంస్కరణల్లో భాగంగా తీసుకొచ్చిన నోటా, తదితర అంశాలపై విస్తృత ప్రచారం చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. సెమినార్‌లో ప్రభాకరరావు, పి.సుధాకరరావు, ఎస్.కిషోర్‌కుమార్, త్రినాథరావు, గణపతి, రమణమూర్తి, రామకృష్ణారావు, జి.గిరిధర్ పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

భారతీయ స్టేట్ బ్యాంకు అధికారులు ఎన్నికల బాండ్ల వివరాలు తక్షణమే బహిర్గతం చేయాలని వామ పక్ష నాయకులు డిమాండ్ చేశాయి. పలాస స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా వద్ద మంగళవారం వామపక్ష నాయకులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.మోహనరావు, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ వేణుగోపాల్, సిపిఐ యంయల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఎం పలాస కార్యదర్శి ఎం.గణపతి మాట్లాడారు. సుప్రీంకోర్టు ఎలక్ట్రారల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు ఇచ్చిన ఫండ్‌ను ఈ నెల 6లోగా బహిర్గతం చేయాలని, ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచాలని ఆదేశించిందని అన్నారు. అయినా ఎస్‌బిఐ వివరాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒత్తిడి వల్లే ఇలా ఆలస్యం చేశారని విమర్శించారు. డొల్ల కంపెనీల పేరుతో బిజెపి తీసుకున్న ఫండ్ ఎంతో తేటతెల్లమవుతుందనే ఈ వివరాలు ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం అడ్డుపడుతుందని అన్నారు. దానికి ఎస్‌బిఐ అధికారులు వంత పాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో గోరు వాసు, దుబ్బ భాస్కరరావు, టి.భాస్కరరావు, బాలజీ, డి.భానుమతి, ఎస్.ఢిల్లేశ్వరి, టి.లక్ష్మి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

పేదల సొంతింటి కల సాకారం

శాసనసభ స్పీకర్ సీతారాం



ఇంటి పత్రాన్ని అందజేస్తున్న స్పీకర్ సీతారాం

ఆమదాలవలస : రాష్ట్రంలోని పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని జగ్గశాస్త్రులపేట వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయాల వద్ద లబ్ధిదారులకు హక్కు పత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జనరంజక పాలన కొనసాగుతోందన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి శత శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. టిడ్కో గృహాలను నెలరోజుల్లో పూర్తిస్థాయి నివాసయోగ్య సౌకర్యాలతో లబ్ధిదారులకు అధికారులు అందజేస్తారని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తిస్థాయిలో సిద్ధం చేసిన రెండు బ్లాకుల్లోని ఇళ్ల గృహ ప్రవేశాలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో టిడ్కో రాష్ట్ర డైరెక్టర్లు కె.గోవిందరావు, కృష్ణమోహన్, వైసిపి నాయకులు బి.రమేష్‌కుమార్, ఎ.ఉమామహేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జి.రవి, ఎఇ కె.అప్పలనాయుడు, టిపిఎస్ హెచ్‌వి సత్యనారాయణ, టిడ్కో ఎస్ఇ కె.ఎస్.ఆర్.మూర్తి, మెప్మా జిల్లా కో-ఆర్డినేటర్ కె.సత్యనారాయణమూర్తి, ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

నేడు తరుణాచారి స్థూపావిష్కరణ

ప్రజాశక్తి- సోంపేట



స్థూపం

తొలి తరం జిల్లా కమ్యూనిస్టు నాయకుడు గానుగుల తరుణాచారి స్మృతి చిహ్నంగా ఏర్పాటు చేసిన స్థూపాన్ని సోంపేట మండలం మామిడిపల్లిలో మంగళవారం ఆవిష్కరించనున్నారు. స్థూపావిష్కరణకు సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఎం నాయకులు కె.మోహనరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడిపల్లిలో కమ్యూనిస్టు నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పూలమాలవేసి అక్కడ నుంచి గానుగుల తరుణాచారి స్థూపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం జరగనున్న బహిరంగ సభలో ముఖ్య అతిథులు ప్రసంగించనున్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని గానుగుల తరుణాచారి విజ్ఞాన కేంద్రం గౌరవ అధ్యక్షులు పాతిని కృష్ణమూర్తి అధ్యక్ష, కార్యదర్శులు జుత్తు సింహాచలం, ఎస్.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.



పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

డ్రోన్‌తో రైతుకు మేలు

శ్రీకాకుళం అర్బన్ : వ్యవసాయ డ్రోన్ల ద్వారా సాగుకు ప్రయోజనం కలుగుతుందని, రైతు శ్రేయస్సుకు దోహదపడుతుందని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లాకు చెందిన అరసవల్లి గాయత్రి ఢిల్లీలో సోమవారం ప్రధాని చేతుల మీదుగా డ్రోన్స్ అందుకున్నారు. ఈ మేరకు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌తో కలిసి కలెక్టరేట్‌లోని కలెక్టర్‌ను మంగళవారం కలుసుకున్నారు. అలాగే జెసి ఎం.నవీన్ కూడా కలిశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డ్రోన్స్ ద్వారా ఎరువులు, పురుగు మందులు స్ప్రే చేయడంతో ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు ఉత్పన్నం కాదన్నారు. వ్యవసాయంలో మహిళల పాత్ర కీలకమన్నారు. వారికి డ్రోన్స్ ఇచ్చి సాగులో ఉపయోగించుకోవడంలో శిక్షణ ఇస్తామని తెలిపారు. రైతులకు తక్కువ ఖర్చుతో, తక్కువ మందుతో, తక్కువ సమయంలో గ్రామం మొత్తం పిచికారీ చేయడానికి ఈ టెక్నాలజీ దోహదపడుతుందన్నారు. దీనివల్ల రైతులకు దిగుబడులతో పాటు పంట నాణ్యత పెరిగి అధిక దిగుబడులు సాధ్యమవుతాయని తెలిపారు.

'వందే భారత్' వచ్చేసింది

ప్రయాణించిన ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రధాని పర్చువల్‌గా వందే భారత్ రైలును మంగళవారం ప్రారంభించారు. శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలులో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రయాణం చేశారు. శ్రీకాకుళం రోడ్‌లో రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. జిల్లాలోని అన్ని రైల్వేస్టేషన్లలో సమగ్ర అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ నుండి ఒక రైలు రోజూ బయలుదేరే విధంగా చేయడమే తన చిరకాల స్వప్నమని అన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, స్థానిక టిడిపి నాయకులు తమ్మినేని విద్యాసాగర్, బి.వి రమణమూర్తి లంక నాగరాజు రైల్వే స్టేషన్ మాస్టర్ మొదలవలస రవి, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ శివశంకర్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తాప పాల్గొన్నారు.

పలాసలో ఘన స్వాగతం

పలాస : విశాఖపట్నం నుంచి భువనేశ్వర్ వరకు ప్రారంభమైన వందే భారత్ రైలుకు పలాసలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అందులో ప్రయాణం చేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడుకు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, సంతోష్ పాల్గొన్నారు.

ఈ ఘనత మాదే : జెడ్‌పి చైర్‌పర్సన్

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో రైల్వే అధికారులకు దఫదఫాలుగా వినతిపత్రాలు అందించి వల్లే వందే భారత్ ఇచ్ఛాపురంలో నిలుపుదల కృషి చేశామని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఇచ్ఛాపురం వచ్చిన వందే భారత్ రైలుకు ఆమె ఘనస్వాగతం పలికారు. ట్రైన్ డ్రైవర్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ పాల్గొన్నారు.



శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్‌కు చేరుకున్న వందే భారత్ రైలు

కాదు మాదే : ఎంపీ

వందే భారత్ రైలు నిలుపుదల ఘనత టిడిపిదేనని ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలుకు టిడిపి నాయకులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వేశాఖ మంత్రికి వినతిపత్రం అందజేశామని, 9 నెలలకు కృషి చేయడంతో జిల్లాలో మూడు స్టేషన్లలో రైల్వే అధికారులు నిలుపుదల చేస్తున్నారని అన్నారు. త్వరలో అమృత్ భారత్ కింద ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ చేపడతారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్, సాలిన ఢిల్లీ యాదవ్, కొండ శంకర్‌రెడ్డి, నందిక జాని, కాళ్ల దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లలో నినాదాలు

ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లో మంగళవారం మధ్యాహ్నం వందే భారత్ రైలు నిలుపుదలపై తమ పార్టీ కృషి వల్లే నని వైసిపి, టిడిపి నాయకులు నినాదాలు చేశారు. దీంతో స్టేషన్‌లో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ప్రధాన పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా రైల్వేస్టేషన్‌కు చేరుకొని పార్టీ జెండాలతో తమ తమ నాయకులకు జిందాబాద్ చెబుతూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. సిఐ టి.ఇమ్మాన్యులురాజు ఆధ్వర్యాన రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు, కానిస్టేబుళ్లు చేరుకుని రెండు పార్టీల నాయకులను వేర్వేరు ప్రదేశాల్లో ఉండేవిధంగా చర్యలు తీసుకున్నారు. అప్పటికీ ఇరు పక్షాలు వద్ద మాఫ్టీలో పోలీస్ సిబ్బంది గట్టి నిఘాపెట్టారు. వైసిపి నాయకులు రైలు డ్రైవర్ వద్దకు చేరుకున్నారు. టిడిపి, జనసేన నాయకులు ఎంపీ కోసం స్టేషన్ మధ్యలో ఉండిపోయారు. వేర్వేరు వారు ఉండడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.




ట్రోఫీని అందజేస్తున్న ఎస్‌పి రాధిక

కలిసి పనిచేయడమే ఫ్రెండ్లీ పోలీసింగ్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రజలు, పోలీసుల మధ్య సహృద్భావ వాతావరణం ఉండాలని, సమాజంతో కలిసి పనిచేయడమే ఫ్రెండ్లీ పోలీసింగ్ అని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. జిల్లా పోలీసు సౌజన్యంతో వాలీబాల్, క్రికెట్ క్రీడా విభాగంలో ఎస్‌పి కప్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు పూండి సాయి వినీత్ విద్యాసంస్థలు ప్రాంగణంలో ఎస్ఐ సిహెచ్.రామారావు ఆధ్వర్యాన మంగళవారం జరిగిన పోటీలో విజేతలకు ఎస్‌పి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలతో ప్రజలు మన దగ్గరకు రావడం కాకుండా... పోలీసులు సమస్యలు దగ్గరకు వెళ్లి పరిష్కారం చూపాలి అన్నారు. అందులో భాగమే మైత్రీ సంఘాల ఏర్పాటు చేశామన్నారు. భయాలు పారదోలడానికే క్రీడా పోటీలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. క్రీడలు వల్ల యువత మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. ఈ పోటీల్లో వజ్రపుకొత్తూరు, పలాస, మందస మండలాలకు చెందిన 68 జట్లు పాల్గొన్నాయి. ఇందులో అరు జట్లు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి జి.ప్రేమకాజల్, డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి, సిఐలు విజయానంద్, పి.ఈశ్వరరావు, పూర్వ డెప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.లీలారాణి, డాక్టర్ చాపర కోదండరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఇఎస్ఎంఎస్‌పై అవగాహన అవసరం

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, నిఘా బృందాలు స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల రియల్ టైమ్ డేటాను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు చేరవేయడానికి ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థను రూపొందించామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్‌పి జి.ఆర్.రాధికతో కలిసి పోలీస్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ పేరుతో ఇఎస్ఎంఎస్ యాప్‌ను రూపొందించామని వెల్లడించారు. ఈ యాప్‌పై సంబంధిత అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో భాగంగా మోహరించే ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు పట్టుకునే నగదు, వస్తువులను కొత్త మొబైల్ అప్లికేషన్ ఇఎస్ఎంఎస్‌లో నమోదు చేయాలన్నారు. ఆయా నివేదికలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలన్నారు. నివేదికల వివరాలను రాష్ట్ర పోలీసు, ఎక్సైజ్, సెంట్రల్, రాష్ట్ర జిఎస్‌టి, ఆదాయపు పన్ను, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, వివిధ భద్రతా సంస్థలు, సేవా ఏజెన్సీలు వివిధ శాఖల అధికారులకు ఏకకాలంలో వీక్షించేందుకు ఈ యాప్ దోహదపడుతుందన్నారు.

ఎన్నికల పర్యవేక్షణ పాదర్శకంగా ఉండేందుకు భారత ఎన్నికల సంఘం ఈ వ్యవస్థను రూపొందించిందని వెల్లడించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, అదనపు ఎస్‌పి ప్రేమ కాజల్, జిల్లా అటవీ శాఖ అధికారి నిషాకుమారి, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ రాణీమోహన్, సిపిఒ ప్రసన్నలక్ష్మి, ట్రెజరీ డిడి రవికుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్ కుమార్ ఔషధ నియంత్రణ శాఖ ఎడి చంద్రరావు పాల్గొన్నారు.


అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

'నాడు-నేడు'తో పాఠశాలల అభివృద్ధి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం పట్టణంలో నాడు-నేడు నిధులు రూ.44 లక్షలతో మెట్టెక్కివలసలో బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మాణం పూర్తి చేసుకున్న అదనపు భవనాలను, అలాగే బొడ్డేపల్లి పేట సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి సిఎం జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి అజంతాకుమారి, కుసుమంచి శ్యామ్‌ప్రసాద్, శ్రీనివాసరావు, మామిడి రమేష్ కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

నిర్వాసితులు త్యాగమూర్తులు

ప్రజాశక్తి- కొత్తూరు

వంశధార నిర్వాసితులు త్యాగమూర్తులని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మంగళవారం మెట్టూరులో సర్పంచ్ ప్రతినిధి మొజ్జాడ చక్రపాణి అధ్యక్షతన కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల నిర్వాసితులు ఎమ్మెల్యేకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంశధార నిర్వసితుల త్యాగం మరువలేనిదన్నారు. నిర్వాసితులకు అదనపు పరిహారం రూ.216 కోట్లు విడుదల చేసిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు. నియోజకవర్గంలో రూ.176 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరైందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో మారాయన్నారు. నిర్వాసితులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. పారాపురం గ్రామానికి చెందిన పిఎసిఎస్ డైరెక్టర్ కుంచాల నూకరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆయనను పరామర్శించారు. అలాగే సిరుసువాడ, కుంటిభద్ర రహదారికి పంచాయతీరాజ్ నిధులు నుంచి రూ.1.98 కోట్లుతో నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు సారిపిల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, జెడ్‌పిటిసి.కె.భాగ్యవతి, సర్పంచ్‌లు రుక్మిణి, కె.రత్నాలు, పి.సాధుబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా సజావుగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ కోరారు. మంగళవారం కార్యాలయంలో నియోజకవర్గస్థాయి ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఓటరు జాబితా బూత్ వారి చేర్చడం జరిగిందని, మార్పులు, చేర్పులు, సవరణలు చేపట్టడం జరిగిందన్నారు. అదే విధంగా ఎన్నికల్లో ఎటువంటి అపోహలకు తావివ్వకుండా నిబంధనల ప్రకారం నిర్వహించాలని, ఇం దుకు అధికారులు సంసిద్ధులుగా ఉండాలన్నారు. సమావేశంలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాలి, కోటబొమ్మాలి మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంపిఎంలు, సిసిఒలు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి భూమి పూజ చేపట్టారు. ఎన్నికలు కోడ్ సమీపిస్తున్న నేపథ్యంలో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. 13, 15వ వార్డులో అచ్చంపేటలో అనపాన రాము ఇంటి నుంచి మాలరేవు బట్టి వరకు రూ.10 లక్షలతో కాలువ నిర్మాణానికి, 18వ వార్డులో రత్తకన్న కార్జీ వీధిలో రూ.3.70 లక్షలతో కాలువ, సంతోషం వీధిని అనుకొని కల్వర్టుకు రూ. 1.20 లక్షలతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నీలపు లక్ష్మి, ప్రేమ్ కుమార్, పట్టణ అధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్, చైర్‌పర్సన్ ప్రతినిధి సంతోష్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

శ్రీకాకుళం అర్బన్ : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, అందుకే సిఎం జగన్మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోర్ నాయుడు అన్నారు. నగరంలోని చేపల వీధి ప్రభుత్వ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతన్న పదో తరగతి విద్యార్థులకు కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధరపు సూరిబాబు ఆధ్వర్యాన సమకూర్చిన పరీక్షా సామగ్రిని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోణార్క్ శ్రీను, ప్రధానోపాధ్యాయులు డి.లక్ష్మి, మండలవల్లి రవి, కింజరాపు రమేష్, ఎ.వి.రమేష్, శ్రీను పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- పోలాకి

మండలం ఆపలాం పంచాయతీలో రూ.21.80 లక్షలతో నిర్మాణం చేపట్టిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని మంగళవారం రాష్ట్ర బిసి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రైతు సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారని, ప్రతి సచివాలయంలో రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేపట్టి రైతులకు అందుబాటులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, అవసరమైన ఎరువులు, ధాన్యం కొనుగోలు వంటి అవసరాలు తీరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ముద్దాడ దమయంతి, మండల పార్టీ అధ్యక్షులు కణితి కృష్ణారావు, జెసిఎస్ కన్వీనర్ సత్తిబాబు, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చింతు రాఘవరావు, మండల యువజన విభాగం అధ్యక్షులు రెంటి కోట త్రినాధరావు పాల్గొన్నారు.


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కృష్ణచైతన్య

వైసిపిలో బయటపడిన విభేదాలు

పాఠశాల ప్రారంభోత్సవానికి హాజరుకాని స్పీకర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో మరోసారి వైసిపిలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. అధికార వైసిపిలో కొంత కాలం నుంచి నాలుగు గ్రూపులుగా విడిపోయి ఎడ మొఖం, పెడ ముఖంగా ఎవరి దారిన వారే ప్రయాణిస్తున్నారు. మంగళవారమూ వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని వైఎస్ఆర్ విగ్రహానికి స్పీకర్ తమ్మినేని సీతారాం, అదే పార్టీకి చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రతినిధి సువ్వారి సత్యనారాయణ ఇరువురు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఇంతవరకు స్పీకర్ తమ్మినేని సీతారాంకు వ్యతిరేక గ్రూపులు కార్యక్రమాల దూరంగా ఉంటూ వేరే కార్యక్రమాలు చేపట్టేవారు. అయితే ప్రస్తుతం తమ్మినేని సీతారాం అనుచరులలో ఉన్న విభేదాలు మంగళవారం ఒక్కసారిగా బయటపడ్డాయి. స్పీకర్ మున్సిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలస జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. ఆ తరువాత పట్టణంలోని గేటులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా అదనపు గదులను ప్రారంభించాల్సి ఉంది. ఇంతలో ఆ పాఠశాల వద్ద నెలకొన్న శిలాఫలక వివాదం బయటపడింది. మాజీ కౌన్సిలర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు భార్య గేటు ఉన్నత పాఠశాల ఎఫ్ఎంసి చైర్మన్‌గా ఉన్నారు. ఆమె పేరు శిలాఫలకంపై లేదని ఉమా మహేశ్వరరావు ఆ శిలాఫలకాన్ని రాత్రి సమయంలో తొలగించినట్లు మరో వర్గం ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ మున్సిపల్ ఇన్‌ఛార్జి ఎఇ బొడ్డేపల్లి సృజన శిలాఫలకంపై తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అల్లంశెట్టి చిన్న పేరును ఏర్పాటు చేసినా, మాజీ కౌన్సిలర్ శాంతించకపోవడంతో పనుల ప్రారంభోత్సవాన్ని నిలిపివేశారు. దీంతో మాజీ కౌన్సిలర్ వ్యతిరేక గ్రూపుకు చెందిన ఒక వ్యక్తి కోసం అంతా సిద్ధం చేసిన పాఠశాల ప్రారంభోత్సవాన్ని నిలుపుదల చేయడం మంచి పద్ధతి కాదని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో వైసిపి నాయకులు ఒక దశలో వాదనలకు దిగారు. గేటు ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవానికి ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేసినా స్పీకర్ ప్రారంభించకుండా అదే రహదారిలో వెళ్లిపోయారు. ఏదేమైనా ఇంతవరకు ఆమదాలవలస నియోజకవర్గంలో తమ్మినేనికి వ్యతిరేక గ్రూపులు ఉండగా, ఇప్పుడు ఆయన అనుచర వర్గంలోనే ఇటువంటి మనస్పర్థలతో వర్గ విభేదాలు ఒక్కసారిగా ఎన్నికల సమీపిస్తున్న కాలంలో బయటపడడంతో పలువురుని ఆశ్చర్యానికి గురిచేసింది.


వాదులాడుకుంటున్న వైసిపి నాయకులు

నిరసనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

బిజెపి ప్రభుత్వం రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు 14న నిర్వహించే నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు చింతాడ అమ్మన్నాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ పిలుపునిచ్చారు. మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడుతూ 540 రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా 14న ఢిల్లీ రామ్‌లా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2021 డిసెంబర్‌లో రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఢిల్లీ బయలుదేరిన రైతాంగాన్ని హర్యానా సరిహద్దుల్లోనే అడ్డగించి, కందకాలు తవ్వడం, మేకులు నాటడం, బారికేడ్లు, రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించడంతో పాటు డ్రోన్ల ద్వారా విష వాయువులు చిమ్మించిందన్నారు. ఈ చర్యల వల్ల అనేకమంది రైతులకు చూపు కోల్పోవడం, కాల్పుల్లో శుభకరణ్ సింగ్ అనే యువరైతు మృతి చెందారన్నారు. రైతుల రుణాలు మాఫీ చేయాలని, కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలని డిమాండ్ చేసారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.లక్ష్మీ పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకుల

సచివాలయాల వ్యవస్థ ఆదర్శం
రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్


గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని సింగిపురంలో రూ.22 లక్షలతో నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రాలను, చాపురంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పెద్దఎత్తున ఉద్యోగాలను నియమించారని అన్నారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖలో 58 వేల ఉద్యోగాలు నియామకం చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- పలాస

సిఎం జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే మహిళలకు అరుదైన గౌరవం దక్కిందని పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ సంత మైదానంలో ఏర్పాటు చేసిన చేయూత నాలుగో విడత చెక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నారని, అందులో భాగంగా మహిళలకు చేయూత పథకం క్రింద నాలుగు విడతల్లో రూ. 75 వేలు ప్రతీ మహిళ ఖాతాలో జమ చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఉంగ సాయికష్ణ, హనుమంతు వెంకటరావు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలం జి.సిగడాంలో ఏర్పాటు చేసిన చేయూత నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పాల్గొన్నారు. చేయుతా మంజూరు చెక్కును మహిళలకు అందజేశారు. ముందుగా దివంగత నేత రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి మాట్లాడుతూ జగనన్న అందించిన సంక్షేమ పథకాల సహాయంతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం సహకారం అందజేస్తుందన్నారు. మహిళలు ఈ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రణస్థలం మండల మాజీ ఎంపిపి గొర్లె పరిమళ, జి.సిగడాం మండల ఎంపిపి మీసాల సత్యవతి, ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షులు బత్తుల సన్యాసిరావు, జెసిఎస్ ఇన్‌ఛార్జి డోల వెంకటరమణ, బూత్ కమిటీ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం పాల్గొన్నారు.


జి.సిగడాం : నమూనా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్


సమీక్షిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

రహదారి భద్రత మనందరి బాధ్యత

శ్రీకాకుళం అర్బన్ : రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉండరాదని, జిల్లాలో రహదారి ప్రమాద మరణాలు సంభవించకుండా రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రహదారి భద్రతపై మంగళవారం సమీక్షించారు. జాతీయ రహదారిపై నవభారత్ బైపాస్ కూడలి వద్ద తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అక్కడా భూ సేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని ఎన్‌హెచ్ఎఐ అధికారులను ఆదేశించారు. అలాగే సింగుపురం అండర్ పాసేజ్‌లో నీరు నిలువ ఉండరాదన్నారు. హైవేపై గుర్తించిన 33 బ్లాక్ స్పాట్లలో ఒక్కటీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త రోడ్డు హైవేపై నరసన్నపేట వైపు వెళ్లే వాహనాల కోసం బైపాస్ ఏర్పాటు చేయాలన్నారు. ఓవర్ లోడుతో వెళ్లే వాహనాలను, క్రాసింగ్ సమయంలో జరిగే ప్రమాదాలను, హెల్మెట్ లేకుండా నడిపే ద్విచక్ర వాహనదారులపైనా ప్రత్యేక శ్రద్ధ సాధించాలన్నారు. రహదారులపై ఇష్టానురీతిన వ్యర్థాలు పోసి, వాటిని తగుల పెట్టే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన గంటలోపే తక్షణ వైద్య సహాయం అందించే యాంత్రాంగం ఉన్నా... సకాలంలో ఎందుకు క్షతగాత్రులకు వైద్యం అందించలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ పోలీసు, రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులు జాతీయ రహదారిపై ఉమ్మడి తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్‌పి జి.ఆర్.రాధిక మాట్లాడుతూ హైవేలపై ప్రతి రెండు మండలాల పరిధిలో పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉన్నాయని, 24 గంటల సేవలు అందిస్తున్నామని వివరించారు. హైవేలపై ప్రమాదాల వల్ల లారీ కాబిన్లలో, వాహనాల్లో చిక్కుకున్న వారిని సకాలంలో రక్షించేందుకు కటర్, వెల్డింగ్ మెషిన్ ఎన్‌హెచ్ఎఐ ఆధ్వర్యాన అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ 14 నెలల కాలంలో జిల్లాలో 709 వివిధ రకాల ప్రమాదాలు సంభవించాయని, ఇందులో 223 మంది ప్రాణాలను కోల్పోగా, 1216 మంది గాయాలతో బయటపడ్డారని వివరించారు. సమావేశంలో రవాణాశాఖ డిసి ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, అదనపు ఎస్‌పి ప్రేమకాజల్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, రవాణాశాఖ అధికారి గంగాధరరావు, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్‌సుధాకర్, ఎన్‌హెచ్ఎఐ పీడీ ప్రభాకర్, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, జిల్లా పంచాయతీ అధికారి కె.వెంకటేశ్వర్లు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి మోహనరావు, జెమ్స్ ఆర్ఎంఒ ప్రవీణ్ పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న హెచ్ఎం కంటయ్య

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- పొందూరు

మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ విద్యార్థులను ఆకట్టుకుంది. మంగళవారం పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు, పదవ తరగతి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు గోపాలశెట్టి సాయికుమార్, రావాడ పాపారావుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో మనిషి మాయం వంటి ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. అనంతరం పాఠశాల హెచ్ఎం బల్ల కంటయ్య ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బురిడికంచరాంలో హెచ్ఎం కిషోర్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 పట్నాన రాజారావు, లోలుగు జెడ్‌పిటిసి, హెచ్ఎం సంజీవరావు పాల్గొన్నారు.

వాకర్స్ స్వాగతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్య పరిరక్షణలో భాగంగా యువతకు సైక్లింగ్‌పై అవగాహన పెంచడంతో పాటు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించేందుకు విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురానికి చెందిన పైల మహేంద్ర సైకిల్ యాత్ర మొదలు పెట్టాడు. అందులో భాగంగా అచ్యుతాపురం నుంచి అయోధ్య వరకు ఈ యాత్ర చేపట్టాలని సంకల్పించి బయలు దేరాడు. ఆయనకు మంగళవారం నగరంలోని సూర్యమహల్ స్టార్ వాకర్సు, లయన్స్ క్లబ్ ఇతర స్వచ్ఛంద సంస్థల సభ్యులు స్వాగతం పలికారు. కార్యమ్రంలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హారికాప్రసాద్, స్టార్ వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, స్టార్ వాకర్సు వ్యవస్థాపక అధ్యక్షులు గేదెల ఇందిరాప్రసాద్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మి, వ్యవస్థాపక అధ్యక్షులు అంధవరపు జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ఘనంగా ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యాన పాత బస్టాండ్ సమీపంలోని మున్సిపాల్ కార్యాలయం ఆవరణలో ఐద్వా జెండాను మంగళవారం ఎగురవేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి మాట్లాడుతూ 1981లో మద్రాసులో జరిగిన ప్రథమ మహాసభలో 15 రాష్ట్రాల నుంచి 393 మంది ప్రతినిధులు హాజరై దేశవ్యాప్త మహిళా సంఘంగా ప్రకటించారని అన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు సామాజిక, ఆర్థిక, రాజకీయ పోరాటాలను ఐద్వా నిర్వహిస్తుందని తెలిపారు. ఐద్వా నగర కన్వీనర్ పి.శ్రీదేవి మాట్లాడుతూ నగరంలో మూడు వార్డుల్లో ఐద్వా జెండా ఆవిష్కరించినట్టు చెప్పారు. మహిళా సాధికారత కోసం మాట్లాడుతున్న పాలక అమలు చేయడంలో వివక్షత చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు ఎం.లలిత మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయడంలో ఫ్యూడల్ భావజాలంతో మునిగిన పాలకవర్గాలు వివక్షత చూపుతున్నాయని అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు కె.జానకి, నగర కమిటీ సభ్యులు డి.సురీడమ్మ మాట్లాడుతూ మద్యం, గుట్కా వంటి మత్తు పదార్థాలు కుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని అన్నారు. వాటిని నిర్మూలించాల్సిన పాలక వర్గాలే పెంచిపోషించడం వారి కపట నీతికి అద్దం పడుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను దుయ్యపట్టారు. కార్యక్రమంలో లావణ్య, మాధవీలత, కాకి సుధ, లక్ష్మి పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున ఐద్వా నాయకులు

ప్రయివేటు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్


వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ప్రయివేటు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పొంది ఉండాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి రిజిస్ట్రేషన్ అథారిటీ, జిల్లా సలహా మండలి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎపిఎంసి చట్టం-2008, క్లినికల్ ఎస్టాబ్లిస్మెంట్ చట్టం, జిఒ నంబరు 35, 135లను అనుసరించి జిల్లాలోని అన్ని ప్రయివేటు ఆస్పత్రులు, డెంటల్ క్లినిక్స్, లేబొరేటరీస్, ఫిజియోథెరపీ సెంటర్లను https://clinicalesttact.ap.gov.in వెబ్ సైట్ నమోదు చేసుకుని, రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం అందజేయాలన్నారు. ఈ నెల 31లోగా డిఎంహెచ్ఒ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న ఆస్పత్రులు ఐదేళ్ల పూర్తయితే రెన్యువల్ చేసుకోవాలన్నారు. అలాగే రోగులకు అందిస్తున్న సేవలపై ప్రయివేటు ఆస్పత్రుల్లో ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. నిర్వహిస్తున్న ప్రతి చికిత్సనూ తప్పనిసరిగా ఆన్‌లైన్ చేయాలన్నారు. ప్రసవాలు, మరణాలు పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ లేకుండా నడిపే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, సలహా మండల సభ్యులు డాక్టర్ చక్క నారాయణరావు, డాక్టర్ అమ్మన్నాయుడు, మాస్ మీడియా అధికారి పి.వి.రమణ పాల్గొన్నారు.


నియామకపత్రాన్ని అందుకుంటున్న సంతోష్ కుమార్

ఎన్‌హెచ్ఆర్‌సి అధ్యక్షునిగా సంతోష్‌కుమార్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇటీవల ఏలూరులో జరిగిన సమావేశంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో (ఎన్‌హెచ్ఆర్‌సి) ఎపి ఇంజినీరింగ్ విభాగాన్ని సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆవిష్కరించారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన జాతీయ సదస్సులో ఇంజినీర్ ముని శ్రీనివాసరావును రాష్ట్ర అధ్యక్షునిగా, వేదుల సంతోష్ కుమార్‌ను శ్రీకాకుళం అధ్యక్షునిగా నియమించారు. సోమవారం జరిగిన రాష్ట్ర సదస్సులో నియామక పత్రాలను అందజేసినట్లు తెలిపారు. వేదుల సంతోష కుమార్ ఇచ్ఛాపురంకు చెందిన వ్యక్తి కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాయం జరిగినా, హక్కులను భంగం కలిగినా తమకు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి వారికి న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని తెలిపారు.


పాల్గొన్న అధ్యాపకులు

అధ్యాపకులకు 'జలధౌతి'

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణం యోగా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన అధ్యాపకులకు మంగళవారం జలధౌతి కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాలధన బాలాజీ పాల్గొని ప్రస్తుత సమాజంలో యోగా ప్రాధాన్యత ఎంతైనా అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్యాస్ట్రిక్, కఫం లాంటివి తగ్గాలంటే జలధౌతి, వస్త్రధౌతి లాంటివి సాధన చేస్తే ఆరోగ్యం బాగుంటుందన్నారు. అనంతరం యోగా శాఖ అధ్యక్షులు డాక్టర్ జి.ఈశ్వరరావు అధ్యాపకులతో జలధౌతి చేయించారు. కార్యక్రమంలో సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ అసిరినాయుడు, డీన్ వెల్ఫేర్ గేదెల రవి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.ముకుందరావు పాల్గొన్నారు.

15న సొసైటీ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- పోలాకి

ఈ నెల 15న పోలాకి కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 15న ఉదయం 10 గంటలకు సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సొసైటీ పాలకవర్గ సభ్యులు, డైరెక్టర్‌లు, రైతులు, సంబంధించిన అధికారులు, సిబ్బంది హాజరుకావాలన్నారు.


మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

పార్టీలకతీతంగా సంక్షేమం

ప్రజాశక్తి- పలాస

రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన వైసిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్ రెడ్డి రూ.700 కోట్లతో ఇంటింటికీ తాగునీరు, 200 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టి ప్రజలకు అంకితం చేశారని గుర్తుచేశారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ పరిపాలన, పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హనుమంతు వెంకటరావు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఉంగ సాయికృష్ణ పాల్గొన్నారు.

వి.జి పురంలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి- లావేరు

మండలం గుమ్మాడం పంచాయతీ వేణుగోపాలపురంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు మంగళవారం బోరును తవ్వకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి దుర్గశి ధర్మారావు, ఎంపిటిసి జగ్గారోతు తవిటినాయుడు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా బోరును తవ్వించడం జరిగిందని తెలిపారు. మోటారు ఏర్పాటు చేసి గ్రామస్తులకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


పోషకాహార అవశ్యకతను వివరిస్తున్న కార్యకర్త కరుణ

పౌష్టికాహారంతోనే బాలల ఆరోగ్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పౌష్టికాహారంతోనే బాలల ఆరోగ్యం సాధ్యమని సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం గోవింద పురం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవంలో ఆమె పాల్గొన్నారు. గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే సమతుల్య ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాలు కలిగిన ఆహారం తీసుకుంటే రక్తహీనత సమస్యలను అధిగమించవచ్చునన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కరుణ పాల్గొన్నారు.


మహిళా దినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు

మహిళలు అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఉన్నత పాఠశాలలో ఎపి టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ కె.అప్పారావు మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందుతున్నారని, సమాజం కూడా స్త్రీ పురుషులను సమానంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.సరస్వతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వి అనిల్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల ఆలోచనా విధానంలో మార్పు రావాలన్నారు. కార్యక్రమానికి జయలక్ష్మి అధ్యక్షత వహించగా, ఉన్నత పాఠశాల హెచ్ఎం విశ్వనాథం, జిల్లా కార్యదర్శి చాణక్య, రాష్ట్ర కౌన్సిలర్ జి.రాజేష్, ప్రతినిధులు ఆర్.కృష్ణారావు, నాగేశ్వరరావు, రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎడిఎ వెంకటరావు

ఆరుతడి పంటలతో అధిక లాభాలు

ప్రజాశక్తి- పలాస
ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలని, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చునని రైతు శిక్షణ కేంద్రం ఎడిఎ సిహెచ్ వెంకటరావు, ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని అమలకుడియాలో మంగళవారం ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో వచ్చిన నష్టాలను ఆరుతడి పంటలను సాగు చేస్తూ భర్తీ చేసుకోవచ్చునన్నారు. రబీతో పాటు వేరు శెనగ, నువ్వు, కట్టి జనుము తదితర పంటలకు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వస్తాయన్నారు. వీటిపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడిఎ మధు, ఎఒ పోలారావు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్'లో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్
టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్ఇండ్ హెచ్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.సంతోష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కె.రవికుమార్, డాక్టర్ టి.గుణవర్ధన్ నాయుడు, డాక్టర్ ఎన్.నాగేశ్వరరావులు 'ఇంజినీరింగ్ ఫిజిక్స్' అనే నూతన పుస్తకాన్ని రాశారు. దీనిని కళాశాలలో డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకం ఆవస్యకతను వివరిస్తూ జెఎన్టియుజివి యూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో మొదటి ఏడాది ఫిజిక్స్ కోర్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. పుస్తకావిష్కరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెన్డీ డీన్ డాక్టర్ డి.ఆజాద్, హెచ్ఒడి డాక్టర్ ఆర్.శాంతికుమార్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

ప్రజాశక్తి- పలాస
మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.బలరాం, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో మున్సిపల్ కార్మికుల సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు సమ్మె పోరాటం ఫలితంగానే వేతనాలు పెరిగాయని, అనేక సదుపాయాలు సాధించుకున్నారని తెలిపారు. పనిముట్లు ఇవ్వాలని, పనికి తగ్గ కార్మికులను భర్తీ చేసి పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ మురగన్, ఎం.రవి, దివాకర్, రమేష్, శంకర్, కుర్మారావు, గులాబీ, సీతమ్మ, శకుంతల, తిరుపతి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

నందిగాం: మండలం లఖిదాస్జి పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. టెక్కలికి చెందిన మధు జ్యూయలరీ దుకాణం యజమాని బెలుసొంటి మధుసూదనరావు, పాఠశాలలో సాంఘిక ఉపాధ్యాయురాగా విధులు నిర్వహిస్తున్న బెందాళం రత్నం సౌజన్యంతో పరీక్షా సామాగ్రి కిట్లును విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు, ఉపాధ్యాయులు ఆర్. రామారావు, డి.రామారావు, తులసీ ప్రసాద్, ప్రియదర్శని, త్రినాధరావు, గోవిందరాజు విద్యార్థులు పాల్గొన్నారు.
సోంపేట: స్థానిక శ్రీశైయన చైతన్య దీపిక ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేశారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, పలాస, మందస మండలాలకు చెందిన సుమారు 350 మంది విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు దేవాడ మోహనరావు, దిద్ది వీర్రాజు, బల్ల జానకిరామ్‌తో పాటు దాతలు దుద్ది శ్రీనివాసరావు, బీన ఆనంద్ కాంతారావు, హేమరాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆశీలు వేలం పాట

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో వివిధ రకాల ఆశీలు వసూలుకు మున్సిపల్ కమిషనర్ రమేష్ అధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. గతంలో నిర్వహించిన బహిరంగ వేలం పాట తక్కువ కావడంతో కౌన్సెల్ సమావేశంలో తిరస్కరించారు. మంగళవారం మరోసారి వేలం పాట నిర్వహించారు. అత్యధిక పాటదారుల వివరాలు కౌన్సెల్ సమావేశంలో పెట్టడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు.

రామ్‌మల్లిక్ నాయుడు పరామర్శ

లావేరు : లావేరు మండల ఈనాడు దినపత్రిక విలేకరి వేణుగోపాలపురం గ్రామానికి చెందిన మీసాల లక్ష్మనాయుడును మంగళవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు పరామర్శించారు. లక్ష్మనాయుడు ఈ నెల 11న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఆస్పత్రిలో వైద్యం పొంది ఇంటికి చేరుకోవడంతో ఆయనను పరామర్శించారు. ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మధుబాబు, గొర్లె శ్రీనువాసురావు, దుర్గశి రాంబాబు ఉన్నారు.

వైసిపితోనే సామాజిక సాధికారత సాధ్యం


ఆమదాలవలస : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస: వైసిపి ఆవిర్భావంతోనే సామాజిక సాధికారిత సాధ్యమైందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం 13 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 14 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారున ఫ్లైఓవర్ దిగున ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడమే అజెండాగా తెలుగు గడ్డపై ఆవిర్భవించిన వైసిపి సరికొత్త రాజకీయాలకు వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, సురవరపు నాగేశ్వరరావు, దుంపల శ్యామలరావు, కుసుమంచి శ్యామ్ ప్రసాద్, పొడుగు శ్రీనివాసరావు, మామిడి రమేష్ కుమార్, దుంపల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.
వైసిపి 14 ఆవిర్భావ దినోత్సవం వేడుకలను సువ్వారి గాంధీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫ్లై ఓవర్ దిగువున ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రతినిధి సత్యనారాయణ పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సువ్వారి అనీల్ కుమార్, బగాది నేతాజీ, పెయ్యల ప్రసాద్, ధర్మ, మోహన్, ఎన్ని శ్రీను, ఆదినారాయణ, రవి, మధు, భాస్కర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం సిఎం జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు ఆధ్వర్యాన నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో గొండు కృష్ణమూర్తి, రఘురాం, పీస గోపీ, ఎం.వి.పద్మావతి, చల్లా అలివేలుమంగ, సాధు వైకుంఠం, పొన్నాడ రుషి, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.
రణస్థలం: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, పరిమళ దంపతులు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి కేకు కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, లావేరు ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, లావేరు జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎచ్చెర్ల పార్టీ కార్యాలయ ఇన్‌ఛార్జి మురళీధర్ బాబా, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు పాల్గొన్నారు.
టెక్కలి రూరల్: స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్‌లో వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, నందిగామ ఎంపిపి నడుపూరు శ్రీరామ్‌మూర్తి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు చింతాడ మంజు, ఎంపిపి ప్రతినిధి మేరుగ అప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం పాల్గొన్నారు.
నందిగాం: వైసిపి కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, మండల పార్టీ అధ్యక్షులు తమరి ఫల్గుణరావుతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి, జెసిఎస్ మండల కన్వీనర్ జడ్యాడ జయరాం, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్ పాల్గొన్నారు.
పొందూరు: మండల కేంద్రంలో అంబేద్కర్ కూడలి వద్ద వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు జై ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.
కోటబొమ్మాళి: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరణ, కేకును కట్‌చేసి వేడుకలను నిర్వహించారు. అంతకుముందు వైసిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, సుంకరి జనార్ధనరావు, సింగుపురం వినోద్, షేక్ రాజు, వైస్ ఎంపిపిలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా పాల్గొన్నారు.
ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు ప్రకాష్‌రావు పట్నాయక్ అధ్యక్షతన నిర్వహించిన వైసిపి ఆవిర్భావ దినోత్సవంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, లోకేశ్వరరావు, తాడి ఆదిరెడ్డి, ప్రత్తి అన్వేష్, సాలిన ఢిల్లీ, సంతోష్ పాల్గొన్నారు. ముందుగా పాతస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.


టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న కృష్ణదాసు

చిరస్మరణీయుడు రాజగోపాలరావు



ఆమదాలవలస : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న సత్యవతి

ప్రజాశక్తి- ఆమదాలవలస
జాతీయస్థాయిలో ఉత్తమ ఎంపీగా జాతీయ నాయకుల వద్ద ప్రత్యేక గుర్తింపు పొందిన దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు జిల్లా ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచారని రాష్ట్ర పిసిసి ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. మంగళవారం రాజగోపాలరావు 101వ జయంతి సందర్భంగా కొత్త రోడ్డు వద్ద ఆయన విగ్రహానికి సత్యవతితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీగా జిల్లాను అన్ని రంగాలతో పాటు ప్రత్యేకంగా రైతాంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆమదాలవలసలో సహకార రంగ చెక్కర పరిశ్రమతో పాటు జిల్లాలో ఎన్నో సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బస్వా షణ్ముఖరావు, లఖినేని సాయిరాం పాల్గొన్నారు.
పలాస: కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో బొడ్డేపల్లి రాజగోపాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ హేంబాబు చౌదరి, లోడగల కామేశ్వరరావు, విఠల్‌రావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు పాల్గొన్నారు.
ప్రముఖ వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావు రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, మాజీ చైర్మన్ కోత పూర్ణ చంద్రరావు, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.
కోటబొమ్మాళి: రాజగోపాలరావు జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఎదురుగా ఉన్న రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ హేమసుందరరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, వైసిపి నాయకులు పేడాడ వెంకటరావు, మెట్ట సింహాచలం, సింగుపురం వినోద్, పూజారి సత్యం పాల్గొన్నారు. అలాగే హరిశ్చంద్రపురం జంక్షన్‌లో ఉన్న బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహానికి సర్పంచ్ కేశవరావు, బగాది దివాకర్‌లు నివాళ్లర్పించారు. అలాగే శ్రీజగన్నాధపురం జంక్షన్ వద్ద రాజగోపాలరావు విగ్రహానికి సర్పంచ్ నూక సత్యరాజు, గ్రామస్థులు నివాళ్లర్పించారు.
శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో రాజగోపాలరావు చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, పిసిసి ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జిలు మీసాల సుబ్బన్న, గుత్తుల శ్రీనివాసరావు, డోల శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సనపల అన్నాజీరావు, పైడి నాగభూషణరావు, అంబటి కృష్ణారావ పాల్గొన్నారు. నగరంలో నవభారత్ కూడలి వద్ద ఉన్న రాజగోపాలరావు విగ్రహానికి వైద్యాధికారి దానేటి శ్రీధర్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో రాజా, సోమేష్, చలం, జగన్, రవి పాల్గొన్నారు.


పలాస : రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న శిరీష

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి- నందిగాం
గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రభుత్వ పథకాలు పేదలకు నేరుగా అందుతున్నాయని వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. సోమవారం మండలం నరేంద్రపురంలో అంగన్వాడీ భవనాన్ని, దిమిలాడులో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలను ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి సిఎం అయిన తరువాత పేద ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి సాధించారన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, బాలక మధుసూదనరావు, మండల పార్టీ అధ్యక్షులు తమిరి ఫాల్గుణరావు, జెసిఎస్ మండల కన్వీనర్ జడ్యాడ జయరాం, మాజీ ఎంపిపిలు వై.చక్రవర్తి, పెద్దలవునిపల్లి ఎంపిటిసి పూడి ఆశారాణి, సర్పంచ్ బొంగి హనుమంతరావు పాల్గొన్నారు.


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ భాస్కరరావు

వంద రోజుల పని దినాలపై దృష్టి

ప్రజాశక్తి- మెళియాపుట్టి
ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఒ జి.భాస్కరరావు అన్నారు. మంగళవారం జోడూరులో ఉపాధిహామీ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా 100 రోజుల పనిదినాలపై దృష్టి సారించాలన్నారు. సమయపాలన పాటిస్తూ కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. ఈయనతో పాటు ఇసి ఆదినారాయణ, పలువురు సిబ్బంది ఉన్నారు.

అవసరాల పిల్లల బోధనకు ఉద్యోగోన్నతి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు పాఠ్యాంశాలను బోధించడానికి అర్హులైన ఎసిటి ఉపాధ్యాయులకు పాఠశాల సహాయకులుగా (స్పెషల్ ఎడ్యుకేషన్) ఉద్యోగోన్నతి కల్పించడానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని డిఇఒ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు ప్రత్యేక విద్యలో బిఇడి, జనరల్ బిఇడితో పాటు రెండేళ్ల పాటు ప్రత్యేక విద్యలో డిప్లొమా అర్హతలు కలిగి ఉన్న ఎటి ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతి పొందడానికి అర్హులని తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 13న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. హాజరయ్యే వారు దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సేవా పుస్తకం, ఇతర అర్హత పొందిన ధ్రువపత్రాలు తీసుకురావాలన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీదేవి

కళింగ కోమట్లను మభ్యపెడుతున్న ధర్మాన

శ్రీకాకుళం అర్బన్ : కళింగ కోమట్లకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఏం చేశారో ఆ సామాజిక తరగతికి తెలుసని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వ్యాఖ్యానించారు. అరసవల్లిలోని ఆమె స్వగృహంలో కళింగ కోమటి సామాజిక నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళింగ కోమట్లను నాడు బిసిలో చేర్చడం గాని, నేడు ఒబిసిలో చేర్చడానికి కృషి చేస్తుందని టిడిపి అని అన్నారు. సమావేశంలో మాజీ మంత్రి అప్పల సూర్యనారాయణ, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కోరాడ హరిగోపాల్, జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ జామి భీమ శంకర్ పాల్గొన్నారు.

యువతి వివాహానికి దాతల సాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
నిరుపేద కుటుంబానికి 'స్మాల్ సర్వీస్ టు సొసైటీ' అండగా నిలిచింది. మూగతో ఉన్న యువతి, అనారోగ్యంతో మంచాన పడిన తండ్రి, చిరు వ్యాపారంతో కుటుంబ భారాన్ని మోస్తున్న తల్లికి ఈ సంస్థ సభ్యులు తమ వంతు సాయాన్ని అందించారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో భోగి శ్రీరామ్మూర్తి కుటుంబం నివాస ముంటున్నారు. శ్రీరామ్మూర్తి చాలాకాలంగా దీర్ఘకాలిక కీళ్ల వ్యాపు వ్యాధితో అనారోగ్యం పాలై వీల్‌చైర్‌కు పరిమితమయ్యాడు. అతని భార్య చిరు దుకాణంలో కష్టపడుతూ కుటుంబాన్ని పోషిస్తుంది. దీనికితోడు కుమార్తె హరిత పుట్టుకతో మూగ కావటంతో చిన్నప్పటి నుంచీ ఇబ్బంది పడుతుంది. హరితను వివాహం చేసుకునేందుకు దూరపు బంధువు తరుపున యువకుడు ముందుకొచ్చారు. ఈ నెల 24న వివాహ ముహూర్తం నిశ్చయించుకున్నారు. పెళ్లి ఖర్చులకు ఇబ్బందుతున్న తరుణంలో నగరగానికి చెందిన కలివరపు సూర్యప్రకాష్, తన స్నేహితులు, దాతల సాయంతో రూ.70 వేలు పోగు చేసి మంగళవారం ఆ కుటుంబానికి అందజేశారు. స్మాల్ సర్వీస్ టు సొసైటీ తరపున రూ.54 వేలు, ఏలియన్స్ క్లబ్ తరపున రూ.16 వేలు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో స్మాల్ సర్వీస్ టు సొసైటీ సభ్యులు జామి కిరణ్‌కుమార్, తంగుడు రాజారావు, సూరు రామారావు, పొడుగు చరణ్, ఫౌండర్ కలివరపు సూర్యప్రకాష్, ఎలియన్స్ క్లబ్ నుంచి కృష్ణారావు, త్రినాతరావు, మన్మథరావు పాల్గొన్నారు.


ఆర్థికసాయాన్ని అందజేస్తున్న సూర్యప్రకాష్

'సూపర్ సిక్స్'పై ప్రచారం


సోంపేట : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- ఆమదాలవలస
రాష్ట్రంలో అసమర్థ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాల్సిందేనని టిడిపి జిల్లా అధ్యక్షుడు అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని దూసి పంచాయతీ పరిధిలోని దూసిపేట, దూసి ఆర్ఎస్, పీరుసాహెబ్‌పేట, ముద్దాడపేట, కంచరవానిపేట, తమ్మయ్యపేట గ్రామాల్లో మంగళవారం శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని అప్పలనాయుడు, చంద్రశేఖర్, కంచరాన లోకేష్, సనపల ఢిల్లేశ్వరరావు, బొడ్డేపల్లి గౌరీపతి, హనుమంతు బాలకృష్ణ, జనసేన నాయకులు పైడి మురళీమోహన్ పాల్గొన్నారు.
సోంపేట: మండలంలోని చిన్న మామిడిపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే అశోక్ ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సంగారు త్రినాథ్, బచ్చాల సారథి, సంగారు హరికృష్ణ, లక్ష్మీనారాయణతో పాటు 60 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
కవిటి: మండలం బొరివంకలో బాబూష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలపై ఎమ్మెల్యే అశోక్ సతీమణి నీలోత్పల ప్రచారం నిర్వహించారు. టిడిపి నాయకులు మణి, బెందాళం విజయ్, బాసుదేవ్ రౌలో, కొర్రాయి వాసుదేవ్, లోళ్ల శ్రీను, పుల్లట సంతోష్, బార్ల చినబాబు పాల్గొన్నారు.
జి.సిగడాం : ఎందువ, నరసింహపురం గ్రామాల్లో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల అధ్యక్షులు రవికుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు పాల్గొన్నారు.


కవిటి : ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

పట్టణంలో పోలీసు కవాతు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ జరగాలని పట్టణంలో మంగళవారం ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. సిఐ టి.ఇమ్మన్యుల్ రాజు అధ్వర్యంలో రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బలగాలతో పురవీధుల్లో కవాతు నిర్వహించారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి- టెక్కలి
మండలం రావివలసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెండవ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ప్రారంభించి మాట్లాడుతూ పాడిపంటలే గ్రామీణ అభివృద్ధికి కీలకమన్నారు. టెక్కలి ఐసిఐసిఐ బ్యాంక్ మేనేజర్ శివకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాంకు అకౌంటు, కెవైసి వంటి విషయాలపై అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం పిఒ లుక్‌పాల్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

కిడ్నీ రోగులకు అన్యాయం

ప్రజాశక్తి- పలాస
వైసిపి ప్రభుత్వంలో కిడ్నీ రోగులకు అన్యాయం జరిగిందని, పూర్తిస్థాయిలో మందులు, వైద్యసేవలు అందడం లేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.దుర్గారావు ఆరోపించారు. 200 పడకల ఆస్పత్రిలో మంగళవారం డయాలసిస్ చేసుకుంటున్న రోగులకు ఉచితంగా ఎరిత్రోపోయిటెన్ ఇంజక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో ఇచ్చిన ఉచిత మందులను వైసిపి ప్రభుత్వం నిలిపివేయడంతో పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డయాలసిస్ చేసుకుంటున్న బాధితులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని, జనసేన, టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉచిత మందుల పంపిణీ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నందిగాం ధర్మారావు, కోన కృష్ణారావు, దువ్వాడ వంశీ చౌదరి, టిడిపి పట్టణ అధ్యక్షులు నాగరాజు, కృష్ణారావు, రాము, దినేష్ కుమార్ పాల్గొన్నారు.


ఇంజక్షన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

అర్హులకు అన్యాయం

ప్రజాశక్తి- పొందూరు
ప్రభుత్వం ఆరోగ్యశాఖలో చేపడుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియలో అర్హులైన ఎంపిహెచ్ఎ(ఎం)లకు అన్యాయం జరుగుతోందని జిల్లా ఎంపిహెచ్ఎ(ఎం) ప్రభుత్వ శిక్షణా అభ్యర్థుల సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.మురళి, జి.రమేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఎమ్.పి.హెచ్.ఎ (మేల్) కాంట్రాక్ట్ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసే ప్రక్రియలో భాగంగా ప్రైవేటు సంస్థల్లో శిక్షణ పొందినట్లుగా అడ్డదారుల్లో ధ్రువపత్రాలు పొంది ఉద్యోగాలు చేస్తున్న అనర్హులకు నియామక పత్రాలు జారీచేసి, ప్రభుత్వ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణ పొంది ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. 21 ఏళ్లగా ఉద్యోగాలు చేస్తున్న ప్రభుత్వ శిక్షణా అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి అర్హులైన అభ్యర్థులను క్రమబద్ధీకరణ చేసి న్యాయం చేయాలని కోరారు.

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
ప్రముఖ సినీ నేపథ్య గాయకులు ఎస్‌సి కారుణ్య కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో వారికి శేషవస్త్రాలను కప్పి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులకు సముచిత స్థానం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి
మంగళగిరిలో జరిగిన జయహో బిసి సభలో నాయీబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడుకు రాష్ట్ర నాయీబ్రాహ్మణులంతా హర్షం వ్యక్తం చేశారని జిల్లా నాయీబ్రాహ్మణుల ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 40 ఏళ్లగా నాయీబ్రాహ్మణులు టిడిపితో ఉన్నందుకు రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సూచనలతో తమకు బిసి సభలో సముచిత స్థానం కల్పించటం ఆనందంగా ఉందన్నారు. కార్పొరేట్ స్థాయిలో సెలూన్ల ఏర్పాట్లుకు ప్రోత్సాహకాలు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పునరుద్ధరణ, దేవాలయాల్లో పని చేస్తున్న వాయిద్యకారులు, వృత్తిదారులకు ఉద్యోగ భద్రత, దేవాలయాల్లో తలనీలాల వేలం పాటలో నాయీ బ్రాహ్మణులకు మాత్రమే అవకాశం తదితర అంశాల ప్రకటించటంతో నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.